క్లుప్తంగా

పుస్తకపఠనంతో విజ్ఞానం



చిన్నారులతో క్యారమ్స్ ఆడిస్తున్న లైబ్రేరియన్ కౌసల్య

కొత్తపల్లి: పుస్తకపఠనం ద్వారా విజ్ఞానం లభిస్తుందని లైబ్రేరియన్ కౌసల్య అన్నారు. ఆదివారం స్థానిక గ్రంథాలయంలో చదవడం మాకిష్టం కార్యక్రమం నిర్వహించారు. విద్యార్థులకు ఆటలు, పాటల పోటీలు నిర్వహించారు. అలాగే వివిధ రకాల పుస్తకాలను పఠనం చేయించారు.

లలితాంబికా వాణిజ్య సముదాయం తనిఖీ



దుకాణ నిర్వాహకురాలితో మాట్లాడుతున్న ఈఓ ఎస్.లవన్న

శ్రీశైలంటెంపుల్: శ్రీశైలదేవస్థానంలో శ్రీలలితాంబికా వాణిజ్య సముదాయాన్ని దేవస్థానం ఈఓ ఎస్ లవన్న ఆదివారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఆయన మాట్లాడుతూ దుకాణదారులందరు తమకు కేటాయించిన స్థల పరిమితితోనే వ్యాపారాలను నిర్వహించుకోవాలన్నారు. దుకాణ పరిధి దాటి ముందుకు రావడం వలన పాదచారులకు ఇబ్బందికరంగా ఉంటుందని చెప్పారు. స్థలపరిమితి దాటి రహదారుల ఆక్రమణలకు పాల్పడితే చర్యలు తీసుకుంటామని దుకాణదారులను హెచ్చరించారు. దుకాణదారులు తమ దుకాణాలను ఇతరుల కు సబ్‌లీజుకు ఇవ్వరాదని సూచించారు. రెవెన్యూ ఇన్‌స్పెక్టర్లు నాగరాజు, శ్రీనివాస రెడ్డి, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ వి.రామకృష్ణ, రెవెన్యూ పర్యవేక్షకులు అయ్యన్న పాల్గొన్నారు.

18న వాహనాల వేలం

నందికొట్కూరు: వివిధ కేసుల్లో పట్టుబడిన వాహనాలను ఈ నెల 18న వేలం వేస్తున్నట్లు టౌన్ సీఐ విజయభాస్కర్ ఆదివారం తెలిపారు. 31 బైకులు, 3 ఆటోలు, 2 కార్లు వేలం వేస్తున్నట్లు చెప్పారు. పోలీసు స్టేషన్ వెనుకభాగంలో ఖాళీగా ఉన్న స్థలంలో వేలం పాట ఉంటుందన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.1000 డిపాజిట్ చెల్లించి పేరు నమోదు చేసుకోవాలని సూచించారు. వేలం పాటకు వచ్చే వారు ఆధార్ కార్డు జిరాక్స్ కాపీ తెచ్చుకోవాలన్నారు.

మహానందిలో సండే సందడి



మహానంది కోనేరులో భక్తుల సందడి

మహానంది: మహానంది ఆలయం ఆదివారం భక్తులతో కళకళలాడింది. సెలవురోజు కావడంతో వేలాది సంఖ్యలో భక్తులు తరలివచ్చారు. ఉగాది సమీపిస్తుండటంతో కన్నడ భక్తులు అధిక సంఖ్యలో వచ్చారు. ఆలయానికి వచ్చిన భక్తులు స్థానిక కోనేరులలో పుణ్యస్నానాలు ఆచరించిన అనంతరం శ్రీ కామేశ్వరీదేవి, మహానందీశ్వరస్వామి వార్లను దర్శించుకుని అభిషేకం, కుంకుమార్చన పూజలు చేపట్టారు.

స్వామివారికి ఏకాంతసేవ పూజలు

స్వామి, అమ్మవార్లకు వార్లకు ఆదివారం రాత్రి ఆలయ వేదపండితులు రవిశంకర అవధాని ఆధ్వర్యంలో ఏకాంతసేవ పూజలు వైభవంగా జరిగాయి. ఉత్సవ మూర్తులను విశేషంగా అలంకరించారు.

అనుమానిత వాహనాల తనిఖీ



వాహనాలను తనిఖీ చేస్తున్న మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్టు అధికారులు

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికలను పురస్కరించుకొని ఆదివారం సాయంత్రం మోడల్ కోడ్ ఆఫ్ కాండెక్టు అధికారులు నాగన్న, ఎస్ఐ వెంకటసుబ్బయ్య, ఏఎస్ఐ జయన్న అనుమానిత వాహనాలను తనిఖీ చేశారు. ఓటర్లకు డబ్బులు పంపిణీ చేయటానికి తీసుకెళ్తున్నారనే అనుమానంతో అధికారులు వాహనాలను తనిఖీలు చేశారు. వారికి ఎలాంటి డబ్బులు, మారణాయుధాలు పట్టుబడలేదని తెలిపారు.

కల్లుదుకాణాలపై సెబ్ దాడులు

జూపాడుబంగ్లా: ఎమ్మెల్సీ ఎన్నికల నేపథ్యంలో ఈనెల 13వతేదీ సాయంత్రం వరకు మద్యం, కల్లుదుకాణాలు తెరచి ఉంచరాదని కలెక్టర్ ఆదేశించినా గ్రామాల్లో యథేచ్ఛగా కల్లుదుకాణాలు తెరచి ఉంచారు. ఆదివారం మండలంలోని తాటిపాడు, పారుమంచాల, తూడిచెర్ల, తరిగోపుల, చాబోలు గ్రామాల్లో కల్లుదుకాణాలు తెరచి ఉంచా రనే సమాచారం మేరకు సెబ్ అధికారులు తనిఖీలు నిర్వహించారు. తాటిపాడు గ్రామానికి చెందిన ఓ వ్యక్తిని అదుపులోకి తీసుకున్నట్లు సెబ్ సీఐ రమేశ్‌రెడ్డి తెలిపారు. ఈనెల 13వ తేదీ సాయంత్రం వరకు ఎవరైనా కల్లుదుకాణాలు తెరిస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రైతుకు 'ఈ-క్రాప్' భరోసా

- పంట నమోదుతో ప్రయోజనాలు మెండు
- పంటలు నష్టపోయిన రైతులకు పరిహారం నేరుగా వారి ఖాతాలకే
- పథకాలు పొందడానికి, దిగుబడులు విక్రయించాడనికి ఉపయుక్తం



రైతు సాగుచేసిన పంట పొలంలో ఈ- క్రాప్ నమోదు చేస్తున్న ఆర్బీకే సిబ్బంది

జూపాడుబంగ్లా: ఈ-క్రాప్ నమోదు రైతన్నకు వెన్నుదన్నుగా నిలుస్తోంది. ప్రభుత్వం నుంచి పంట నష్టపరిహారం అందాలన్నా, సబ్సిడీపై ఎరువులు, పరికరాలు అందాలన్నా, పంట విక్రయించుకోవాలన్నా అన్నింటికీ పంట నమోదే ఆధారం. టీడీపీ ప్రభుత్వ హయాంలో ఈ-క్రాప్ నమోదును సక్రమంగా అమలు చేయకపోవడంతో సక్రమంగా వర్షాలు కురవక పోయినా, ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటలు నష్టపోయినా రైతులకు పరిహారం అందడంలో సమస్యలు ఎదురయ్యేవి. అయితే వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక ఈ-క్రాప్‌ను పకడ్బందీగా అమలు చేస్తోంది. దీంతో ఏఏ పంటలు ఎన్ని హెక్టార్లలో సాగుచేశారో తెలుసుకోవటంతో పాటు పండించిన పంటను రైతులు స్వగ్రామాల్లోనే సులభంగా విక్రయించుకునే వెసులుబాటు కల్పించింది. ప్రకృతి వైపరీత్యాల వల్ల పంటనష్టం వాటిల్లితే సంబంధిత రైతు బ్యాంకు ఖాతాకు నేరుగా నష్టపరిహారం జమచేస్తోంది.

రైతులకు పంట నష్టపరిహారం

పంట నమోదు ఆధారంగానే ఇప్పటిదాకా మూడు విడతల్లో నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో గతేడాది ఖరీఫ్‌లో పంటలు నష్టపోయిన 18,750 మంది రైతులకు సుమారు రూ.8.5 కోట్ల మొత్తాన్ని మంజూరు చేసినట్లు వ్యవసాయ అధికారులు తెలిపారు. అలాగే ఈ ఏడాది ఖరీఫ్‌లో సంభవించిన అధికవర్షాల వల్ల దెబ్బతిన్న పత్తి పంటకు క్రాప్ ఇన్స్‌రెన్స్ కింద నియోజకవర్గం వ్యాప్తంగా 950 మంది అన్నదాతలకు రూ.3.5కోట్ల నగదు వారి బ్యాంకు ఖాతాల్లో జమ అయినట్లు వెల్లడించారు. వీటితో పాటు పీఎం కిసాన్ - రైతుభరోసా, రైతులు సాగుచేసిన పంటలకు అవసరమైన ఎరువులు, పురుగు మందుల సరఫరాకు ప్రణాళికలు రూపొందించి ప్రభుత్వం ఆర్బీకేల ద్వారా సరఫరా చేస్తోంది.

85 శాతం ఈ-కేవైసీ పూర్తి

నందికొట్కూరు నియోజకవర్గంలోని జూపాడుబంగ్లా, నందికొట్కూరు, పగిడ్యాల, మిడుతూరు, పాములపాడు, కొత్తపల్లి మండలాల్లో ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం 1,16,517.73 ఎకరాలు కాగా 2022-23 రబీ సీజన్‌లో 65,184.13 ఎకరాల్లో 39,140 మంది రైతులు మొక్కజొన్న, జొన్న, కంది, మినుము, పెసర, పొద్దుతిరుగుడు, తదితర పంటలను సాగుచేశారు. రబీలో సాగుచేసిన పంటలను గ్రామాల్లోని రెవెన్యూ, వ్యవసాయ, ఆర్బీకే సిబ్బంది ఈ-క్రాప్ బుకింగ్ నమోదు ప్రక్రియ పూర్తిచేసి ఈకేవైసీ చేస్తున్నారు. ఇప్పటికే నియోజకవర్గం వ్యాప్తంగా ఈ-కేవైసీ సగటున 85 శాతం పూర్తి కావటంతో రైతులు పండించిన శనగ ధాన్యానికి బహిరంగ మార్కెట్లో గిట్టుబాటు ధరల్లేని కారణంగా ప్రభుత్వం ఆర్బీకేల్లో కొనుగోలు కేంద్రాల ఏర్పాటుచేసి మద్దతు ధర క్వింటాలు రూ.5,335లకు కొనుగోలు చేసేందుకు పేర్లు నమోదు చేస్తున్నారు.

ఏటా ఈ -క్రాప్ బుకింగ్ చేయించుకుంటున్నా



నేను ఏటా 30ఎకరాల పంటలు సాగుచేస్తా. సాగుచేసిన పంటలను తప్పనిసరిగా ఈ -క్రాప్‌బుకింగ్ చేయించుకొంటున్నా. గతేడాది పంట నమోదు చేయించుకోవటం వల్ల పండించిన మొక్కజొన్న ధాన్యాన్ని గ్రామంలో ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రంలో సులభంగా విక్రయించుకోగలిగాను. ఈ ఏడాది కూడా ఖరీఫ్, రబీలో సాగుచేసిన పంటలను బుకింగ్ చేయించుకున్నాను.
– నాగిరెడ్డి, రైతు, తర్తూరు

ధాన్యం సులభంగా విక్రయించా



గతేడాది ఈ -క్రాప్‌బుకింగ్ చేయించుకోవటం వల్ల ధాన్యాన్ని కొనుగోలు కేంద్రంలో సులభంగా విక్రయించుకోగలిగాను. ఈ ఏడాది కూడా ఖరీఫ్,రబీలో సాగుచేసిన పంటలకు ఈ క్రాప్ బుకింగ్ చేయించుకున్నాను. ఒక వేళ పంట నష్టపోతే పంట నమోదు చేయించు కోవటం వల్ల రైతు ఖాతాలకే డబ్బులు జమ అయ్యే అవకాశం ఉంది.
– చెన్నారెడ్డి, రైతు, తూడిచెర్ల

ఈ -క్రాప్ నమోదు తప్పనిసరి



రైతులు సాగుచేసిన పంటలను తప్పనిసరిగా గ్రామాల్లోని రైతుభరోసా కేంద్రాల వద్ద ఈ క్రాప్‌బుకింగ్ చేయించుకోవాలి. తద్వారా చేతి కందిన ధాన్యం విక్రయించుకోవటం, పంటనష్ట పరిహారం పొందటం సులభతరం అవుతుంది. కౌలురైతు గుర్తింపు కార్డులు ఉన్న రైతులు కూడా కార్డులను వినియోగించుకొని ఈ క్రాప్ బుకింగ్ చేయించుకోవాలి. ప్రస్తుతం అన్ని ఆర్బీకేల్లో ఈ క్రాప్‌బుకింగ్ పూర్తిచేసి ఈ-కేవైసీ కొనసాగుతుంది. – విజయశేఖర్, ఏడీఏ, నందికొట్కూరు

పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు



జూపాడుబంగ్లాలో సిబ్బందికి సూచనలిస్తున్న నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి

ఆత్మకూరు: ఆత్మకూరు డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో ఎమ్మెల్సీ ఎన్నికల సందర్భంగా అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద భారీ బందోబస్తు ఏర్పాటు చేసినట్లు ఆత్మకూరు సీఐ సుబ్రహ్మణ్యం తెలిపారు. ఆదివారం విలేకరులతో మాట్లాడుతూ ఆత్మకూరు, వెలుగోడు, కొత్తపల్లి,పాములపాడు మండలాల పోలింగ్‌కేంద్రాల వద్ద ఇద్దరు డీఎస్పీలు, ఆరుగురు ఎస్సైలు, వంద మంది సిబ్బందితో బందోబస్తు ఏర్పాటు చేస్తున్నామని, డివిజన్‌లోని అన్ని కేంద్రాల వద్ద పోలీసులు పటిష్టమైన బందోబస్తు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోలింగ్‌కేంద్రాల వద్ద అల్లర్లకు పాల్పడడం , ఓటర్లను ప్రభావితం చేయడం చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అన్ని రాజకీయ పార్టీ నాయకులు, కార్యకర్తలు పోలింగ్ కేంద్రాల వద్ద ప్రశాంతంగా ఎన్నికలు జరిగేందుకు సహకరించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలను పరిశీలించిన రూరల్ సీఐ

పగిడ్యాల/జూపాడుబంగ్లా: నందికొట్కూరు రూరల్ సీఐ సుధాకర్‌రెడ్డి ఆదివారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఏర్పాటు చేసిన రెండు పోలింగ్ కేంద్రాలను, జూపాడుబంగ్లా ఆదర్శ పాఠశాల పోలింగ్ కేంద్రాన్ని పరిశీలించారు. పోలింగ్ కేంద్రాల వద్ద అల్లర్లు చోటుచేసుకోకుండా పటిష్టమైన బందోబస్తు చేపట్టాలని ఎస్ఐ నాగార్జునకు ఆదేశించారు. పోలింగ్ కేంద్రాలకు 200 మీటర్ల దూరంలో బయటి వ్యక్తులు ఎవ్వరు కనిపించరాదని, 144 సెక్షన్ ఉల్లంఘనలకు పాల్పడితే చట్టపరమైన చర్యలు తీసుకోవాలని సూచించారు.

అడవిలో అన్నదానానికి సన్నద్ధం



సరుకులు నిండిన వాహనాలతో భక్త బృందం

ఆత్మకూరురూరల్: ఆత్మకూరు అటవీ డివిజన్‌లోని నాగలూటి వీరభద్ర ఆలయం వద్ద గత 17 సంవత్సరాలుగా ఉగాది వేడుకలకు అన్నదానం నిర్వహిస్తున్న శ్రీశైల మల్లికార్జున మల్టీపర్పస్ ట్రస్ట్ వారు మరోసారి మహా అన్నవితరణకు సర్వ సన్నద్ధమై అడవికి బయలుదేరి వెళ్లారు. ఆదివారం మహారాష్ట్ర లోని కొల్హాపూర్ జిల్లా ఇచ్చల కరంజికి చెందిన సుమారు 300 మంది కన్నడ భక్తులు నాలుగు లారీలలో సరుకులన్ని సమకూర్చుకుని అన్నదానా స్థలమైన నాగలూటి బయలుదేరి వెళ్లారు. ట్రస్ట్ సభ్యులు శిరీష్‌పాటిల్, పాండుల నేతృత్వంలో ఈ బృందం ఉగాది పర్వదినం వరకు కర్ణాటక, మహారాష్ట్రల నుంచి పాదయాత్రగా శ్రీశైలం వెళ్లే లక్షలాది మంది శివభక్తులకు 24 గంటలు అన్నప్రసాదాన్ని అందుబాటులో ఉంచుతారు. చల్లటి మజ్జిగకూడా పంపిణీ చేస్తారు. అలాగే వైద్య సేవలనుకూడా ఈ ట్రస్ట్ అందిస్తుంది.

రైతు సంక్షేమమే ధ్యేయం



శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి

మిడుతూరు: రైతు సంక్షేమమే రాష్ట్ర ప్రభుత్వ ధ్యేయమని పీరుసాహెబ్ పేట సహకార సొసైటీ చైర్మన్ నాగతులసిరెడ్డి అన్నారు. ఆదివారం మండల పరిధిలోని పీరుసాహెబ్ పేట గ్రామంలో సహకార సొసైటీ ఆధ్వర్యంలో శనగల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ ఈ ఏడాది ప్రభుత్వం శనగలకు మద్దతు ధర క్వింటా రూ. 5335లతో కొనుగోలు చేస్తుందని చెప్పారు. బహిరంగ మార్కెట్‌లో తక్కువ ధర ఉందని, దళారుల చేతిలో మోసపోకుండా రైతులు విక్రయించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రశేఖర్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షుడు నబిరసూల్, నాయకులు జగన్‌మోహన్‌రెడ్డి, జగదీశ్వరరెడ్డి, తువ్వా లోకేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

పరీక్షలకు పకడ్బందీ ఏర్పాట్లు

మిడుతూరు: ఈ నెల 15న నిర్వహించే ఇంటర్మీడియెట్ పరీక్షలకు సీసీ కెమెరాల పర్యవేక్షణలో పకడ్బందీగా ఏర్పాట్లు చేసినట్లు పరీక్షల నిర్వహణ అధికారి, ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ సలీంబాషా తెలిపారు. ఆదివారం స్థానిక ఆదర్శ పాఠశాలలో పాత్రికేయుల సమావేశం నిర్వహించారు. ఈ నెల 15వ తేదీ నుంచి 29వ తేది వరకు ఇంటర్మీడియెట్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. విద్యార్థులు పరీక్షాకేంద్రానికి ఉదయం 8.30 గంటలకు చేరుకోవాలని, 9 గంటల తర్వాత ఒక్క నిమిషం ఆలస్యమైన లోనికి అనుమతించమని చెప్పారు. పరీక్షా కేంద్రానికి ఎలక్ట్రిక్ పరికరాలు, సెల్ ఫోన్‌లు తదితర వస్తువులకు అనుమతి ఉండదన్నారు.

ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్‌సీపీ ఆవిర్భావం



పార్టీ కార్యాలయంలో వైఎస్సార్ విగ్రహానికి పాలాభిషేకం చేస్తున్న ఎమ్మెల్యే తొగురు ఆర్థర్

- ఎమ్మెల్యే తొగురు ఆర్థర్
- ఘనంగా వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు

నందికొట్కూరు: ప్రజా సంక్షేమం కోసమే వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఆవిర్భవించిందని ఎమ్మెల్యే తొగురు ఆర్థర్ అన్నారు. ఆదివారం పట్టణంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలు ఘనంగా జరుపుకున్నారు. వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే పాలాభిషేకం చేశారు. పార్టీ కార్యాలయంలో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లోని వైఎస్సార్ విగ్రహాలకు ఎమ్మెల్యే, రాష్ట్ర ఉర్దూ అకాడమీ డైరెక్టర్ షేక్ అబ్దుల్ షుకూర్, హౌసింగ్ కార్పొరేషన్ రాష్ట్ర డైరెక్టర్ రమాదేవి, సింగిల్ విండో చైర్మన్ హుసేనయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ పదేళ్ల కాలంలో అడుగడుగునా కష్టాలు ఎదురొచ్చినా ధైర్యం ముందడగు వేసిన ఘనత సీఎం వైఎస్ జగనన్నకే దక్కుతుందన్నారు. రాష్ట్ర ప్రజలు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిపై నమ్మకంతో బ్రహ్మరథం పట్టారని, చరిత్రలో లేని విధంగా రాష్ట్ర ప్రజలు 151 సీట్లు కానుకగా ఇచ్చారని చెప్పారు. జగన్ పాలనపై అన్ని వర్గాల ప్రజలు సంతృప్తిగా ఉన్నారన్నారు. కార్యక్రమంలో పార్టీ ఎస్సీ సెల్ జిల్లా అధ్యక్షుడు వెంకటరమణ, జిల్లా ఎస్సీ, ఎస్టీ సెల్ విజిలెన్స్ మానిటరింగ్ కమిటీ సభ్యుడు దిలీప్, కౌన్సిలర్లు ధర్మారెడ్డి, జాకీర్, వైఎస్సార్‌సీపీ స్థానిక నాయకులు డాక్టర్ వనజ, దేవసహాయం, విక్టర్, అయ్యన్న తదితరులు పాల్గొన్నారు.

ఆత్మకూరులో..

ఆత్మకూరు: పట్టణంలోని వైఎస్సార్‌సీపీ కార్యాలయం వద్ద ఆదివారం వైఎస్సార్‌సీపీ ఆవిర్భాల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ శ్రీశైలం నియోజకవర్గం కన్వీనర్ శిల్పా భువనేశ్వరెడ్డి , నియోజకవర్గం అబ్జర్వర్ సురేందర్ రెడ్డి ఆధ్వర్యంలో పార్టీ జెండాను ఆవిష్కరించారు. వారు మాట్లాడుతూ పార్టీ అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి 13 ఏళ్ల క్రితం పార్టీని ఏర్పాటు చేశారన్నారు. అప్పటినుంచి నేటి వరకు పార్టీ ప్రజలకు అందుబాటులో ఉంటూ వారి సంక్షేమాల కోసం నిర్విరామంగా కృషి చేస్తుందని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ పట్టణ, మండల అధ్యక్షులు అంజాద్‌అలీ, రాజమోహన్‌రెడ్డి, మున్సిపల్ చైర్‌పర్సన్ ఆసియామారూఫ్, జెడ్పీటీసీ కురుకుంద శంకర్‌రెడ్డి, ఎంపీపీ తిరుపాలమ్మ, వార్డు కౌన్సిలర్లు ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, పార్టీ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్‌సీపీ ప్రయాణం ఓ చరిత్ర

వెలుగోడు: 12 ఏళ్ల వైఎస్సార్‌సీపీ ప్రయాణం ఓ చరిత్ర అని ఆ పార్టీ మండల అధ్యక్షుడు అంబాల ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఆదివారం పట్టణంలోని పార్టీ ఆఫీసులో వైఎస్సార్‌సీపీ ఆవిర్భావ వేడుకలు ఘనంగా జరిగాయి. అంబాల ప్రభాకర్‌రెడ్డి పార్టీ జెండా ఆవిష్కరించి కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో పార్టీ అధికార ప్రతినిధి దేశం తిరుపంరెడ్డి, సర్పంచ్ వేల్పుల జయపాల్, సింగిల్ విండో చైర్మన్ వంగాల నాగేశ్వరరెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఇలియాస్ ఖాన్, తెలుగు రమణ, ఎంపీటీసీ రాజేష్, మోతుకూరు నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు బ్రెడ్డు, పండ్లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే



ఆత్మకూరులో కేక్‌కట్ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు



వెలుగోడులో వైఎస్సార్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న నాయకులు

పాములపాడులో..

పాములపాడు: మండలకేంద్రమైన పాములపాడులో వైఎస్సార్‌సీపీ పార్టీ ఆవిర్భావ దినోత్సవ వేడుకలను వైఎస్సార్‌సీపీ నాయకులు మాజీ ఎంపీటీసీ సభ్యులు చౌడయ్య, రామలింగేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వారు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకురు. కార్యక్రమంలో సర్పంచ్‌లు వరప్రసాదు, రామస్వామి, మౌలాలి, నాయకులు అంబయ్య, రమణారెడ్డి, శివలింగం తదితరులు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ ఎన్నికలకు ఏర్పాట్లు పూర్తి

- పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లిన పోలింగ్ సిబ్బంది



మాట్లాడుతున్న ఆర్డీఓ దాస్



పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్తున్న సిబ్బంది

ఆత్మకూరు: డివిజన్ పరిధిలో పట్టభద్రులు, ఉపాధ్యాయ ,స్థానిక సంస్థల ఎమ్మెల్సీ ఎన్నికల కోసం అన్ని ఏర్పాట్లును పూర్తి చేశారు. పట్టణంలోని ప్రభుత్వ ఉన్నతపాఠశాల మైదానంలో పోలింగ్ సిబ్బంది నియామకం, బ్యాలెట్లు, బ్యాలెట్ బాక్సులు, సిబ్బంది నియామకం తదితర ఏర్పాట్లును అధికారులు పూర్తి చేశారు. ఆత్మకూరు పట్టణంలో నాలుగు పోలింగ్ కేంద్రాలతో పాటు ఆత్మకూరు, నందికొట్కూరు రెవెన్యూ డివిజన్ పరిధిలో 26 పోలింగ్ కేంద్రాల్లో అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. ఇందులో 26 మంది పోలింగ్ ఆఫీసర్లను, వారితో పాటు 10 రిజర్వ్ పోలింగ్ ఆఫీసర్లను నియమించారు. వీరితో పాటు 26 మంది ఏపీఓలు, డీపీఓస్‌లు 53 మంది, రిజర్వ్ 12 మందిని నియమించారు. మొత్తం 26 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేశారు.

ఆత్మకూరులో స్థానిక సంస్థల పోలింగ్ కేంద్రం

స్థానిక సంస్థల పోలింగ్ కేంద్రాలను పట్టణంలోని ఆర్డీఓ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఆత్మకూరు మున్సిపల్, వార్డులతో పాటు నందికొట్కూరు వార్డు సభ్యులు, ఆత్మకూరు, నందికొట్కూరు రెవెన్యూ డివిజన్‌పరిధిలోని వివిధ మండలాలకు చెందిన ఎంపీటీసీలు, జెడ్పీటీసీలు తమ ఓటు హక్కును ఈ పోలింగ్ కేంద్రంలో వినియోగించుకోనున్నారు. ఆత్మకూరు ఆర్డీఓ దాస్ ఆధ్వర్యంలో పోలింగ్ సిబ్బందిని నియమించారు. ఇందుకు సంబంధించి పోలింగ్‌సిబ్బంది ఆయా పోలింగ్‌కేంద్రాలకు బయల్దేరి వెళ్లారు. వివిధ మండలాలకు చెందిన తహసీల్దార్‌లు, ఎంపీడీఓలు, వివిధ కార్యాలయాల అధికారులు, సిబ్బంది పోలింగ్ కేంద్రాలకు తరలివెళ్లారు. ఇప్పటికే పోలింగ్‌కేంద్రాల వద్ద పోలింగ్ బూత్ ఏర్పాటు, అందులో కావాల్సిన సౌకర్యాలు ఏర్పాటు చేస్తున్నారు. వివిధ శాఖల అధికారులు ఏర్పాట్లులో నిమగ్నమయ్యారు.

ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలి

ఆత్మకూరు రెవెన్యూ డివిజన్ పరిధిలోని అన్ని మండలాల్లో జరుగుతున్న ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంతంగా నిర్వహించాలని ఆర్డీఓ దాస్ ఆదేశించారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాల మైదానంలో ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ ఎన్నికలు జరిగే సమయంలో ఎవరైనా కవ్వింపులలకు పాల్పడితే కేసులను నమోదు చేస్తామన్నారు. అన్ని పోలింగ్ కేంద్రాల వద్ద 144 సెక్షన్ అమలు లో ఉంటుందన్నారు. సోషల్‌మీడియాలో అసభ్యకరమైన వీడియోలు, తప్పుడు ప్రచారాలు నిర్వహిస్తే సత్వరమే కేసులు నమోదు చేస్తామని చెప్పారు. ఎమ్మెల్సీ ఎన్నికలు ప్రశాంగా జరిగేందుకు అన్ని పార్టీల నాయకులు సహకరించాలని కోరారు.

పోలింగ్ కేంద్రాల వివరాలు మండలాల వారీగా

పోలింగ్ కేంద్రం పేరు	గ్రాడ్యుయేట్ పోలింగ్ బూత్‌లు	టీచర్ పోలింగ్ బూత్‌లు
ఆత్మకూరు	03	01
బండిఆత్మకూరు	01	01
శ్రీశైలం	01	01
వెలుగోడు	02	01
నందికొట్కూరు	03	01
పాములపాడు	01	01
మిడుతూరు	01	01
జూపాడుబంగ్లా	01	01
పడిద్యాల	01	01
కొత్తపల్లి	02	01

పోలింగ్‌కు సర్వం సిద్ధం

నందికొట్కూరు: పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల్లోని అభ్యర్థుల భవితవ్యం సోమవారం తేలనుంది. ఎన్నికల సామగ్రితో సిబ్బంది ఆయా పోలింగ్ కేంద్రాలకు చేరుకున్నారు. సామగ్రిని సరిచూసుకుంటూ, పోలింగ్ సజావుగా జరిగేలా ఏర్పాట్లు చేసుకుంటున్నారు. నందికొట్కూరు నియోజకవర్గంలో 7,723 మంది పట్టభద్రులు, 519 మంది ఉపాధ్యాయులు తమ ఓటు హక్కును వినియోగించుకోనున్నారు. ఆయా మండలాల్లో పోలింగ్ కేంద్రాలను తహసీల్దార్లు, ఎంపీడీఓలు పరిశీలించారు.



నందికొట్కూరు పోలింగ్ కేంద్రంలో ఎన్నికల సామగ్రి సరిచూసుకుంటున్న పీఓలు

అమ్మవారికి పల్లకీ సేవ

శ్రీశైలంటెంపుల్: శ్రీభ్రమరాంబా మల్లికార్జున స్వామి వార్ల ఉత్సవమూర్తులకు ఆదివారం సందర్భంగా అమ్మవారి ఆలయ ప్రాంగణంలో పల్లకీ సేవ నిర్వహించారు. ముందుగా ప్రత్యేకంగా అలంకరించిన పల్లకీలో ఉత్సవమూర్తులు ఆశీనులుగావించి వేదమంత్రోచ్చారణల నడుమ ప్రత్యేక పూజలు చేసి, మేళతాళాలతో ఆలయ ప్రదక్షిణ చేశారు. ఈ పూజా కార్యక్రమాల్లో ఈఓ లవన్న, అర్చకులు పాల్గొన్నారు.

మల్లన్న సన్నిధిలో మహానంది ఈఓ

మహానంది: మహానంది దేవస్థానం ఈఓ కాపు చంద్రశేఖర్‌రెడ్డి ఆదివారం శ్రీశైలం భ్రమరాంబిక, మల్లికార్జునస్వామివార్లను దర్శించుకున్నారు. కుటుంబ సభ్యులతో కలిసి వెళ్లిన వారికి ఆలయ అధికారులు స్వాగతం పలికి పూజలు చేయించారు.

తప్పిన ప్రమాదం

మహానంది: మహానందీశ్వరస్వామి దర్శనార్థం వచ్చే భక్తులకు ప్రమాదం త్రుటిలో తప్పింది. మదనపల్లెకు చెందిన ఆరుగురు భక్తులు కారులో మహానంది వస్తుండగా ఆదివారం రాత్రి గాజులపల్లె రైల్వేస్టేషన్ సమీపంలోని బగ్గిరోడ్డు మలుపు వద్ద కారు అదుపుతప్పి మిరపతోటలోకి దూసుకెళ్లింది. అదృష్టవశాత్తు ఈ ప్రమాదంలో ఎవరికీ గాయాలు లేకపోవడంతో భక్తులు ఊపిరిపీల్చుకున్నారు.

పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక

నందికొట్కూరు: మండలంలోని వడ్డేమాన్ గ్రామంలో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థులు 20 ఏళ్ల తరువాత చిన్ననాటి తీపి జ్ఞాపకాలను పంచుకుంటూ ఆదివారం పూర్వ విద్యార్థుల ఆత్మీయ కలయిక నిర్వహించారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన ఉపాధ్యాయులను సాదరంగా ఆహ్వానించి ఘనంగా సన్మానించారు. గురువుల ఆశీర్వాదాలు తీసుకున్నారు. కార్యక్రమంలో అప్పటి హెచ్ఎం మురళీధర్ రెడ్డి, ఉపాధ్యాయులు సరస్వతి, సంపూర్ణ, కృష్ణమూర్తి, లైబ్రరీ శంకరయ్య, ఆంజనేయులు, పూర్వ విద్యార్థులు స్వాములు, నాగరాజు, జగన్, కిరణ్ తదితరులు పాల్గొన్నారు.



గురువులతో పూర్వ విద్యార్థులు